## క్లుప్తంగా

### ఎస్సీ యువకులకు ఉద్యోగ అవకాశాలు

**నకరికల్లు:** నిరుద్యోగ ఎస్సీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జాబ్స్ రిసోర్స్‌పర్సన్ శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా సంస్థ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్స్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్సీ యువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. వయస్సు 18–35 లోపు కలిగి పదోతరగతి ఉత్తీర్ణత లేదా ఫెయిల్ అయి ఉండవచ్చన్నారు. లిడ్‌కాప్ పేరుతో నల్లపాడులో 45 రోజులపాటు కుట్టు, కటింగ్‌పై ఉచిత వసతితో కూడిన శిక్షణనిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శ్రీ సిటి, తడలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. ఉద్యోగం పట్ల ఆసక్తి లేనివారికి సొంత వ్యాపారానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సోమవారం నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని ఆసక్తి గల వారు 9908482907 నంబరును సంప్రదించవచ్చన్నారు.

### రేపు సత్తెనపల్లిలో మినీ మహానాడు

**సత్తెనపల్లి:** సత్తెనపల్లిలో మంగళవారం సాయంత్రం 4:00 గంటలకు రఘురామ్‌నగర్‌లో నియోజకవర్గ స్థాయిలో మినీ మహానాడు నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మినీ మహానాడుకు ముఖ్య అతిథులుగా నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఇతర నాయకులు పాల్గొంటారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

### టెన్త్ సీబీఎస్ఈ ఫలితాల్లో ప్రతిభ చూపిన యశ్వంత్‌కు సత్కారం



**సత్తెనపల్లి:** టెన్త్ సీబీఎస్ఈ ఫలితాల్లో 486/500 మార్కులు సాధించి ప్రతిభ చూపిన సత్తెనపల్లి పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థి జొన్నలగడ్డ యశ్వంత్‌ను ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో సత్కరించారు. సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు గ్రామంలో ఆదివారం యశ్వంత్‌ను సత్కరించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి పాలెపోగు సుమని, ఎంఈఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు గరికపాటి హిట్లర్, జాయింట్ సెక్రటరీ విజయ్ వర్ధన్, ఉపాధ్యాయులు రామకోటయ్య, సురేష్, ఎస్‌బీఐ మేనేజర్ మణిదాస్, హెడ్ క్యాషియర్ జాన్సన్, ప్రేమ్ కుమార్, చిలుక రమణయ్య, లక్కరాజుగార్లపాడు గ్రామస్తులు పాల్గొన్నారు.

### త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



**సత్తెనపల్లి:** పెను ప్రమాదం త్రుటిలో తప్పిన సంఘటన పట్టణంలోని గుంటూరు రోడ్‌లో ఆదివారం జరిగింది. గురజాలకు చెందిన పాటి యశ్వంత్ మరో నలుగురితో కలిసి కారులో గుంటూరు నుంచి గురజాల వెళుతుండగా గుంటూరు మార్గంలోని పెద్ద కాలువ బ్రిడ్జి గ్రిల్స్‌ను ఢీ కొట్టడంతో కారు ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఎవరికి ప్రాణహాని లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

### ట్రాక్టర్ చోరీపై కేసు నమోదు

**ముప్పాళ్ళ:** మండలంలోని గోళ్లపాడు గ్రామ సమీపంలోని పెట్రోల్‌బంక్ సమీపంలో నిలిపి ఉన్న ట్రాక్టర్ చోరీపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు ఆదివారం తెలిపారు. కుందురువారిపాలెం గ్రామానికి చెందిన యాదగిరి నవీన్ తన ట్రాక్టర్‌ను ఈ నెల 16వ తేదీన సాయంత్రం గోళ్లపాడు గ్రామ సమీపంలోని పెట్రోల్‌బంక్ పక్కన ఖాళీ స్థలంలో రోజులాగే మొక్కజొన్న కోత మిషన్ పక్కన పెట్టి ఇంటికి వెళ్లాడు. కొద్దిసేపు తర్వాత వచ్చి చూడగా ట్రాక్టర్ కనిపించకపోవటంతో ముప్పాళ్ళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### భక్తిశ్రద్ధలతో హరేరామ సంకీర్తన

**నూజెండ్ల:** హనుమత్ జయంతి ఉత్సవాలలో భాగంగా నూజెండ్లలో హనుమాన్ దీక్షా స్వాములచే హరేరామ సంకీర్తన ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. విశ్వక్సేన పూజతో ప్రారంభమైన ఈ ఉత్సవాలలో భాగంగా ఆదివారం నగర ఉత్సవం జరిగింది. 19న గ్రామదేవతలకు పూజ, 20న స్వామి వారికి తోమాల సేవ, హనుమాన్ చాలీసా పారాయణం, 21న సహస్ర కలశాభిషేకం, 22న స్వామి వారికి విశేషాలంకరణ, సామూహిక హనుమత్ వ్రతాలు, ఇరుముడి కార్యక్రమం, గ్రామస్తుల సహకారంతో అన్నప్రసాద వితరణ, దీక్షా స్వాముల జాపాలి యాత్ర, 23న పూర్ణాహుతి, పీఠం ఉద్వాసన కార్యక్రమాలు ఉంటాయని అర్చకుడు రామ మోహనాచార్యులు తెలిపారు.

నిరుపయోగంగా భవనాలు..

# మందుబాబులకు నిలయాలు

**పులిచింతల నిర్వాసితుల కేంద్రంలో అధ్వానంగా ప్రభుత్వ భవనాల పరిస్థితి**



తలుపులు, కిటికీలు ధ్వంసం అయిన గ్రంథాలయం



నిరుపయోగంగా ఉన్న పశువైద్యశాల

- కిటికీల అద్దాలు, తలుపులు పగలగొట్టిన అరాచకశక్తులు
- కంప, పిచ్చి మొక్కలు మొలిచి భయంకరంగా తయారైన వైనం
- గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రానికి కేటాయింపు

**రాజుపాలెం:** లక్షల రూపాయలు ఖర్చుపెట్టి కట్టించిన ప్రభుత్వ భవనాలు ఎందుకు పనికి రాకుండి నిరుపయోగంగా తయారయి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. ఆ భవనాల్లో రాత్రి వేళల్లో మందుబాబులు వీరంగం సృష్టిస్తూ సీసాలను పగలగొడుతుండడంతో చుట్టు పక్కల వారు భయాందోళనకు గురవుతున్నారు. అరాచక శక్తులు కొన్ని భవనాలలోని తలుపులు, కిటికీ అద్దాలు పగలగొట్టారు. నిర్వాసితులు వారిని



పిచ్చి మొక్కలతో నిండిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం

ప్రతిఘటిద్దామంటే వారిపైనే ఎదురు తిరుగుతున్నారు. చేసేదిలేక దీంతో నిర్వాసితులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. అలాగే కొన్ని భవనాలలో విపరీతంగా కంప, పిచ్చి మొక్కలు మొలిచి పాడుబడిపోయాయి. పిచ్చి చెట్లు మొలవడంతో అటు వైపు వెళ్లాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి. ఇది మండల కేంద్రంలోని రాజుపాలెం పులిచింతల నిర్వాసితుల ఆవేదన.

#### నిరుపయోగంగా పడి ఉన్నాయి

మండల కేంద్రంలోని రాజుపాలెం పంచాయతీ పరిధిలో 2010లో పులిచింతల నిర్వాసితుల కేంద్రాన్ని అన్ని హంగులతో ఏర్పాటు చేశారు. ఆ సమయంలో కేంద్రంలో పాఠశాలతో పాటు ప్రజా ఉపయోగకరంగా ఉండేందుకు గ్రంథాలయం, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, కమ్యూనిటీ హాల్, పశువుల వైద్యశాలను నిర్మించారు. వీటితోపాటు ఐదు షాపులను నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొన్ని భవనాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి.

■ అంగన్‌వాడీ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నడుస్తుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీ కార్యలయ భవనాన్ని రైతు భరోసా కేంద్రంకు, 108 వాహన సిబ్బంది ఉండేందుకు కేటాయించారు. మిగిలిన భవనాలు అరాచక శక్తులకు, జూదర్లకు, మందుబాబులకు నిలయంగా మారాయి. ఇప్పటికే ఆ భవనాలకు ఉన్న కిటికీ అద్దాలను పగులగొట్టారు. రాత్రివేళల్లో బీభత్సం సృష్టిస్తున్నారు. నిర్వాసితులు ఆ భవనాలను కాపాడలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆ భవనాలను, షాపులను పంచాయతీ వారు స్వాధీనం చేసుకుని వేరే కార్యాలయాలకు వినియోగించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

#### మందుబాబులకు నిలయాలు



నిర్వాసితుల కేంద్రంలో కట్టిన ప్రభుత్వ భవనాలు మందుబాబులకు నిలయంగా మారాయి. రాత్రి వేళ్లో బీభత్సం సృష్టిస్తున్నారు. నిర్వాసితులు ఎవ్వరు వారికి చెప్పలేక పోతున్నారు. ప్రభుత్వం ఆ భవనాలను వేరే ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగించితే బాగుంటుంది.

– ముక్క సుధాకర్, నిర్వాసితుడు

#### చర్యలు చేపడతాం

పులిచింతల నిర్వాసిత కేంద్రంలో కట్టిన ప్రభుత్వ భవనాలను ఆయా శాఖల అధికారులు వినియోగించుకుంటే ఇలాంటి సమస్యలు రావు. ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సిబ్బంది ఉండే విధంగా చర్యలు చేపడతాం.

– సురేష్, పంచాయతీ కార్యదర్శి, రాజుపాలెం

### రైల్వే స్టేషన్, బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీలు



**సత్తెనపల్లి:** జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శాంతి భద్రతల నేపథ్యంలో పట్టణంలోని రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లో పట్టణ పోలీసులు ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణ ఎస్ఐ ఎం.సంధ్యారాణి నేతృత్వంలో ఎస్పీ కార్యాలయ బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ టీములు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాయి. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

### చాగంటివారిపాలెం గ్రామ ఉపసర్పంచ్ ఎన్నిక నేడు

**ముప్పాళ్ళ:** మండలంలోని చాగంటివారిపాలెం గ్రామ ఉప సర్పంచ్ ఎన్నిక ఈ నెల 19వ తేదీన గ్రామ సచివాలయంలో జరుగుతుందని ఈఓపీఆర్డీ పి.రూపవతి ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ ఎన్నిక జరుగుతుందని చెప్పారు. గతంలో నెలకొన్న ఒప్పందం మేరకు ఎన్నిక జరగనుంది. ఇప్పటి వరకు ఉప సర్పంచ్‌గా వ్యవహరించిన సభ్యుడు రాజీనామా చేయటంతో ఎన్నిక అనివార్యమైంది. ఎన్నిక ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు.

## దళిత విద్యార్థిని కొట్టిన నిందితులను అరెస్టు చేయాలి

**ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి ప్రతినిధులు**

**క్రోసూరు:** దళిత విద్యార్థి జేమ్స్‌ను కొట్టి మూత్రం తాగించిన యశ్వంత్ నాయుడు, రౌడీ షీటర్లు రూపేష్, చోటాబ్లేడ్, కిరణ్, జగ్గ, నానీలను వెంటనే అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం క్రోసూరులోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండలి అధ్యక్షుడు బుల్లా రాజారావు మాట్లాడుతూ తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలో ఓ కళాశాలలో బీటెక్ విద్యార్థి జేమ్స్ అనే దళిత యువకుడిని కులం పేరుతో అదే కళాశాలలో చదివే జూనియర్ విద్యార్థి యశ్వంత్ నాయుడు, రౌడీషీటర్లతో కలిసి కొట్టడమే కాకుండా మూత్రం పోసి తాగించారని ఆరోపించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కేసు తీసుకోకపోవటం దుర్మార్గమని అన్నారు. పోలీసులే కొంతమంది పేర్లు



మాట్లాడుతున్న ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి ప్రతినిధులు

తొలగించి ఫిర్యాదు రాసి బాధితుడితో సంతకం తీసుకోవటం జరిగిందని, నిందితులకు సహకరించిన పోలీసులను సస్పెండ్ చేయాలని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, కిడ్నాప్ కేసు, అటెంప్ట్ టు మర్డర్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో గార్లపాటి దాసు, అద్దేపల్లి క్రిస్టఫర్, చిలక భాస్కరరావు, కంచర్ల అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు మద్దతు ధర కల్పించాలి

**వ్యవసాయ కార్మిక సంఘాల కార్యదర్శి హనుమంతరావు**

**అచ్చంపేట:** రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రకటించిన రూ.20 వేలు తక్షణమే అందించాలని డిమాండ్ చేస్తూ అచ్చంపేట, క్రోసూరు మండలాల వ్యవసాయ కార్మిక సంఘాల కార్యదర్శి హనుమంతరావు ఆదివారం అచ్చంపేటలో ప్రచార రథం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులు పెంచి 200 రోజుల పని దినాలు కల్పించాలని, వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు నిషేధించాలని, నూతన కౌలు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని గ్రామాలలో తిరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై



ప్రచారం చేస్తున్న హనుమంతరావు

రైతులకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. మే 20వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లో జరిగే నిరసన కార్యక్రమానికి అధిక సంఖ్యలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపూరి వెంకటేశ్వరరావు, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

### పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**సత్తెనపల్లి:** పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సత్తెనపల్లి మండలం కందులవారిపాలెం గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కందులవారిపాలెం గ్రామానికి చెందిన పాల విక్రేత బి.నాగిరెడ్డి (30) కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం పురుగు మందు సేవించాడు. హుటాహుటిన సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య నాగలక్ష్మి, కుమార్తెలు దీప్తి, వాసంతి ఉన్నారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**సత్తెనపల్లి:** వైద్యశాలలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన సత్తెనపల్లి మండలం పణిదం గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామానికి చెందిన వేటగిరి పెద్ద అంజయ్య (50) పణిదం నుంచి ద్విచక్ర వాహనంపై దీపాలదిన్నెపాలెం వైపు శనివారం వెళుతుండగా వాహనంపై నుంచి జారి కింద పడి గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య విజయలక్ష్మి, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### ఐదుగురు జూదరుల అరెస్టు

**నాదెండ్ల:** గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఎస్సై జి. పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. గొరిజవోలు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఐదుగురు జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.16,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### ఎస్సీ హాస్టల్‌లో వంట పాత్రలు చోరీ

**నాదెండ్ల:** గణపవరం శాంతినగర్ మూడో సచివాలయం సమీపంలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహంలో వంట పాత్రలు చోరీకి గురైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కొన్నేళ్లుగా ఈ వసతి గృహానికి వార్డెన్‌గా తిరుపతయ్య, నైట్ వాచ్‌మెన్‌గా దేవి విధులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం తిరుపతయ్య సెలవు పెట్టారు. దేవి శనివారం రాత్రి హాస్టల్‌కు వెళ్లగా.. వంట గదిలో పాత్రలు కనిపించలేదు. చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే వార్డెన్‌కు సమాచారమిచ్చారు. ఆయన సూచన మేరకు ఆదివారం నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొందరు మహిళలు చెత్త ఏరుకున్నట్లు నటించి ఇలా చోరీలకు పాల్పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

## గ్రామ స్థాయిలో సీపీఐని బలోపేతం చేయాలి

**సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ**

**అమరావతి:** నిరంతరం ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తున్న సీపీఐని గ్రామీణ ప్రాంతాలలో బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి పల్నాడు జిల్లా కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమరావతి సీపీఐ శాఖ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు శీలం ముని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలతో పాటు రైతులు, రైతు కూలీలు, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీపీఐ కార్యకర్తలు, నాయకులు నిర్వహించే ప్రజా ఉద్యమాలలో ప్రజలను భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందన్నారు. మండల సీపీఐ కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు ఆధ్వర్యంలో మండల కమిటీ



పార్టీజెండా ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

సభ్యులు, కార్యకర్తలు, నాయకులు తొలుత పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాంబాబు, ఉదయ శేఖర్, మైలా మాధవరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అమరావతి సీపీఐ శాఖ కార్యదర్శిగా శీలం ముని**

ఈ సమావేశానంతరం నిర్వహించిన అమరావతి సీపీఐ శాఖ కార్యవర్గ ఎన్నికలో అమరావతి సీపీఐ శాఖ కార్యదర్శిగా శీలం ముని, సహాయ కార్యదర్శిగా మంత్రాల యేసు, కమిటీ సభ్యులుగా టి.వెంకటేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, గాలం సాబశివరావు, మాధవరావు, బి.వేదాంతం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## చదువుతోనే బంగారు భవిష్యత్

**రాష్ట్ర మేదరసంఘం అధ్యక్షుడు జొరిగే మస్తాన్‌రావు**

**అమరావతి:** విద్యార్థులకు చదువుతోనే బంగారు భవిష్యత్ సాధ్యమవుతుందని రాష్ట్ర మేదరసంఘం అధ్యక్షుడు జొరిగే మస్తాన్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన 2024–25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలలో 500 మార్కులు దాటిన విద్యార్థులకు జిల్లా మేదరసంఘం ఆధ్వర్యంలో ప్రోత్సాహకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా మేదర సంఘం అధ్యక్షుడు జొరిగే శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జొరిగే మస్తాన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలతో విద్యాభ్యాసం చేయాలన్నారు. అలాగే జిల్లా మేదర సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించి ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 500



విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందిస్తున్న దృశ్యం

మార్కులు దాటిన 20 మంది విద్యార్థులకు వెయ్యి రూపాయల నగదుతోపాటు పుస్తకాల బ్యాగ్, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మేదర సంఘం గౌరవాధ్యక్షుడు ధూళిపాళ్ళ ఏసుబాబు, శ్రీశైలం మేదర సత్రం చైర్మన్ నందికట్టు హనుమాన్ ప్రసాద్‌తో పాటు జిల్లా మేదర సంఘ ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే జీవిత లక్ష్యాలను ఎంచుకోవాలి



మాట్లాడుతున్న వైష్ణవ కృపదాస్



విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న కూనాగు వెంకటేశ్వర్లు

- నరసరావుపేట ఇస్కాన్ టెంపుల్ కో ఆర్డినేటర్ వైష్ణవ కృప దాస్
- ముగిసిన వేసవి ఆధ్యాత్మిక శిక్షణ శిబిరం

**సత్తెనపల్లి:** విద్యార్థి దశ నుంచే జీవిత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని నరసరావుపేట ఇస్కాన్ టెంపుల్ కో ఆర్డినేటర్ వైష్ణవ కృప దాస్ అన్నారు. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) సంస్థాపకచార్యులు శ్రీశ్రీల ఏసీ భక్తి వేదాంతం స్వామి ప్రభుపాదుల వారు ఇస్కాన్ నరసరావుపేట వారి ఆధ్వర్యంలో సత్తెనపల్లిలో గత నెల 24 నుంచి ఆదివారం వరకు ఇస్కాన్ ప్రహ్లాదుని బడి బాలబాలికలకు శిక్షణ శిబిరం నిర్వహించారు. శిక్షణ శిబిరం ముగిసిన సందర్భంగా పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైష్ణవ కృప దాస్ మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన, ఒత్తిడిని జయించాలన్నారు. వేసవి కాలంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలు విజ్ఞానానికి దోహదం చేస్తాయన్నారు. విద్యార్థి దశ నుంచి ఆర్థిక క్రమశిక్షణను పాటించాలన్నారు. పుస్తక పఠనం విజయానికి నాంది అని, విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి పుస్తకాలు చదవడంపై ఆసక్తి కనబరచాలన్నారు. విద్యతోనే అభివృద్ధి, అవగాహన ముడిపడి ఉందని తల్లిదండ్రులు, విద్యార్థుల విద్యాభ్యాసంలో నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు.

నెల రోజులపాటు నిర్వహించిన శిక్షణలో భగవద్గీత శ్లోకాల పారాయణం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మృదంగం, కీర్తనలు, శ్లోకాలు జపం.. ఇలా 10 రకాల అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. సనాతన ధర్మం, సామాజిక విలువలు, మంచి లక్షణాల గురించి విద్యార్థులకు నేర్పించామన్నారు. రాబోయే సంవత్సరాల్లో దీనిని మరింతగా అభివృద్ధి పరుస్తూ పిల్లలకి ఆధ్యాత్మిక శిక్షణ, వేసవి కాలంలో సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి చిన్నారులందరికీ దివ్యమైన అవకాశం, ఆత్మ వికాసం, బుద్ధి వికాసం, మనోల్లాసం, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించేలా శిక్షణ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. అంతేకాక శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్‌లు అందించారు. శిక్షణకు స్థానికంగా వైకుంఠ శక్తి దేవదాసి, అత్యుష మాతాజీలు సహాయకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆంధ్రాబ్యాంక్ మెయిన్ బ్రాంచ్ గోల్డ్ అప్రైజర్ కూనాగు వెంకటేశ్వర్లు(బుజ్జి), ఆర్యవైశ్య నాయకులు జెమిలి రాధాకృష్ణమూర్తి, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాల అభివృద్ధికి సహకరించండి

**ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్**



**పెదకూరపాడు:** రాజధాని నిర్మాణంలో భాగంగా రెండవ విడత భూ సమీకరణ కోసం పెదకూరపాడు మండలం కంభంపాడు, బలుసుపాడు గ్రామాల్లో తహసీల్దార్ ధనలక్ష్మి అధ్యక్షతన ఆదివారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ రాజధాని అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామి కావాలన్నారు. భూ సమీకరణకు సహకరించిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా రాజధాని నిర్మాణంలో పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలు, రైతులు సహకరించడం సంతోషంగా ఉందన్నారు. భూ సమీకరణ ప్రక్రియపై రైతులకు అందించే పరిహారం, అభివృద్ధి ప్రణాళికను వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు భూ సమీకరణకు సహకరిస్తామని చేతులు ఎత్తి ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్డీవో కుమార్, స్థానిక గ్రామాల రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ప్రభుత్వాలు

**వినుకొండ:** పట్టణంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆవివారం పట్టణ కార్యదర్శి ఎస్‌కే ఫిరోజ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా కార్యదర్శి తోట ఆంజనేయులు మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలో ప్రభుత్వాలు రెండూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పనిచేస్తూ కార్మికులకు, రైతులకు హాని చేసే చట్టాలు తీసుకొస్తున్నాయని ఆరోపించారు. ఆర్థిక సంక్షోభంలో దేశం కూరుకుపోతోందని తెలిపారు. ప్రజల మధ్య మతాల పేరుతో వైరుధ్యాలు పెంచుతూ రాజకీయ మనుగడ కొనసాగిస్తున్నాయని విమర్శించారు. అనంతరం 11 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎస్‌కే ఫిరోజ్,



మాట్లాడుతున్న తోట ఆంజనేయులు

మునగపాటి ప్రసాద్, కామా వెంకటేశ్వర్లు, పల్లపాటి భాస్కర్, ముప్పాళ్ల ప్రసాద్, వెంకయ్య, జయరావు, కొండలు, యలమంద, నాగులు, షారుఖ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.